సంక్షేమ సారథి జగనన్ననే సీఎంను చేసుకుందాం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి, పెడన అభ్యర్థి ఉప్పాల రాము



కృత్తివెన్ను మండలంలో జరిగిన ప్రచారంలో ఉప్పాల రాము



మల్లవోలు గరువులో ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

కృత్తివెన్ను: ప్రతి గడపనకు సంక్షేమ ఫలాలను అందించి పేదల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము), మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. విజయీభవ యాత్రలో భాగంగా ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా చిన గొల్లపాలెం, పల్లెపాలెం, పడతడిక, లక్ష్మీపురం, నిడమర్రు, గరిశపూడి, మాట్లం గ్రామ పంచాయతీల్లో జరిగిన యాత్రలో పాల్గొన్న అభ్యర్థులు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తమకు విజయాన్ని చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీరప్రాంత అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీర ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు పేదల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం చిన గొల్లపాలెం ఏటీపవర్ వద్ద ప్రారంభమైన విజయీభవ యాత్రకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఆ పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వైథాని వెంకట్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, మహిళా కన్వీనర్ ఝాన్సీ, సర్పంచులు సునీల్, ప్రదీప్, రాజు, సుబ్రమణ్యం, నాగార్జున, ఎంపీటీసీలు, పార్టీ వివిధ అనుబంధ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మరో ఐదేళ్లు సంక్షేమ పాలన

గూడూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తే మరో ఐదేళ్లు రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా ఆదివారం గూడూరు మండలంలోని మల్లవోలు గరువు, రామన్నపేట, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఉప్పాల హారిక వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల స్థితి గతులు మెరుగుపర్చడమే ధ్యేయంగా ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా వారికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు రానున్న ఐదేళ్ల కాలం కొనసాగిస్తూ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారని చెప్పారు. అమ్మ ఒడి పథకం ద్వారా ప్రస్తుతం అందుతున్న రూ.15వేలకు మరో రెండు వేల రూపాయలు పెంచారన్నారు. రైతు భరోసాద్వారా ప్రస్తుతం అందిస్తున్న సాయాన్ని మరింత పెంచి రూ.16వేలు అన్నదాత ఖాతాల్లో నేరుగా జమ చేస్తారని తెలిపారు. అవ్వాతాతకు ఇచ్చే సామాజిక పెన్షన్ మరో రూ.500 పెరగనుందన్నారు.

హామీలన్నీ అమలు

ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా వైఎస్సార్ సీపీ అధినేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించిన హామీలన్నీ కచ్చితంగా అమలు అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై పూర్తి అవగాహనతోనే మేనిఫెస్టో రూపకల్పన చేశారని చెప్పారు. అమలు కాని ఏ ఒక్క హామీ ఇవ్వలేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బందరు పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన అసెంబ్లీ అభ్యర్థిగా ఉప్పాల రాముకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. తద్వారా రాష్ట్రంలో తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటై ప్రజలందరికీ మేలు జరగడానికి అవకాశం ఉంటుందని ఆమె విజ్ఞప్తి చేశారు.

అడుగడుగునా జననీరాజనం

మల్లవోలు గరువు, రామన్నపేట గ్రామాల్లో పర్యటించిన ఉప్పాల హారికకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామని నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, మాజీ జెడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, నేతలు పర్లం పెదబాబు, కారుమంచి కామేశ్వరరావు, బొర్రా సాంబయ్య, పిట్ల రామిరెడ్డి, మురాల వెంకట ప్వయ్య, మురాల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి జగన్

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు



చిన్నాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని చిన్నాపురంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు వారి వారి గ్రామాల్లోనే వ్యవసాయ సేవలను అందించారని గుర్తు చేశారు. ఏటా రైతులకు లబ్ధి చేకూరుస్తూ రైతులపై అభిమానాన్ని చాటుకున్నారన్నారు. పిల్లల విద్యాభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులను సైతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో నాడు నేడు పేరుతో పాఠశాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. దీంతో పేద పిల్లల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అలాంటి నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఒక్కసారి ముఖ్యమంత్రి అయితేనే పేదల కోసం, రైతులకు ఇన్ని పథకాలు అమలుపరిచిన జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితే రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రతి పేద రైతు కుటుంబం ఆర్థికంగా, విద్యాపరంగా మరింత అభ్యున్నతి సాధిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతును ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- కమ్మనమోలులో వైఎస్సార్ సీపీ అవనిగడ్డ అభ్యర్థి రమేష్ విస్తృత ప్రచారం
- గ్రామస్తులతో మమేకమై కెప్టెన్ లక్ష్మి, ఉజ్వల ఓట్లు అభ్యర్థన



కమ్మనమోలు ప్రచారంలో రమేష్‌బాబు, కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు

కమ్మనమోలు(నాగాయలంక): గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ ప్రజలకు మరింత చేరువ కాబోతున్నారని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. నాగాయలంక మండలం కమ్మనమోలులో వైఎస్సార్ సీపీ ఆధర్యాన ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలసి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మళ్లీ రావాలి జగన్, మళ్లీ కావాలి జగన్ అంటూ ఇంటింటికీ తిరిగి మే13న జరిగే పోలింగ్‌లో అవనిగడ్డ అసెంబ్లీకి తనను, బందరు పార్లమెంట్‌కు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మి, పెద్ద కుమార్తె ఉజ్వల గ్రామంలోని ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు నేతృత్వంలో సాగిన ప్రచారం కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది వెంకటనారాయణ(చిన్నారి), సర్పంచి సనకా మురళీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు(చంటి) రైతువిభాగం నేత బీసాబత్తుని ప్రసాద్, పిచుక రాము, గుంటూరు సురేష్, చోడవరం సర్పంచి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణయ్యను అవమానించి ఇప్పుడు పొగడ్తలా

ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగాయలంక మండలం కమ్మనమోలులో సింహాద్రి రమేష్ బాబు మీడియా ప్రతినిధులుతో మాట్లాడుతూ బుద్ధప్రసాద్ తీరును దుయ్యబట్టారు. నిజాయతీ పరుడైన అంబటి బ్రాహ్మణయ్యను నాడు తీవ్రంగా అవమానించిన జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఇప్పుడు పొగడటం విడ్డూరంగా ఉందన్నారు. బ్రాహ్మణయ్య తనయుడు శ్రీహరిబాబు తన తండ్రి పేరును ఉల్లిపాలెం వంతెనకు పెట్టమని కోరితే తీవ్రంగా అవమానించి అతని సీటును సైతం దొంగిలించిన దొంగ బుద్ధప్రసాద్ ఇపుడు నీతులు చెపితే జనం పట్టించుకోరని ఎద్దేవా చేసారు. అవనిగడ్డ గడ్డపై మళ్లీ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని సింహాద్రి ధీమా వ్యక్తం చేశారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కోడూరులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న సింహాద్రి రామ్‌చరణ్



వెంకటాపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

కోడూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు యువనేత సింహాద్రి రామ్‌చరణ్ అన్నారు. ఆదివారం రామచరణ్ ఆ పార్టీ మండల నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికల హామీలను అమలు చేసి, మళ్లీ ఇవ్వగలమని మేనిఫెస్టో రూపొందించి ప్రజల ముందు వచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని రామ్‌చరణ్ అన్నారు. విద్య, వైద్యరంగాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి, గ్రామ స్థాయికే కార్పొరేట్ తరహా వైద్యం, విద్యను జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబును, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి, ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, నేతు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(మోపిదేవి): పేద వర్గాలకు అండగా నిలిచిన జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు యువనేత వికాస్‌బాబు, కుమార్తె నిశ్చల, అల్లుడు డాక్టర్ రంగనాథ్ అన్నారు. వెంకటాపురం, అన్నవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం సాయంత్రం హోరెత్తించారు. ఇంటింటా తిరుగుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, మండల ఎస్సీసెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ కన్వీనర్ పిండి వెంకటేశ్వరావు, తుమ్మా రవి, మాజీ ఎంపీటీసీ అబ్బూరి నాంచారయ్య, గ్రామ ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, గంజాల వెంకటేశ్వరావు, తుమ్మా వెంకటేశ్వరావు, పరసా ప్రభాకరరావు, మాతంగి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



39వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్ తదితరులు



27వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లను గెలిపించాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఇద్దరికీ అఖండ మెజార్టీ చేకూర్చాలని కోరారు. ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఇవి మళ్లీ అందాలంటే వీరిద్దరిని గెలిపించుకోవాలని కోరారు. నగరంలోని 27వ డివిజన్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, 39వ డివిజన్‌లో కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, 8వ డివిజన్‌లో శ్రీరాం చిన్నా ఆధ్వర్యంలో నాయకులు, గృహసారథులు ప్రచారంలో పాల్గొన్నారు.

హోరాహోరీ నుంచి వన్‌సైడ్ వార్

- పెడన నియోజకవర్గంలో జోరుగా ప్రచారం
- వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్న నియోజకవర్గ ప్రజలు

పెడన: పెడన నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలు వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులుగా ఉప్పాల రమేష్(రాము), కాగిత కృష్ణప్రసాద్‌లున్నారు. ఇద్దరు కూడా హోరాహోరీగా తలపడుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను బట్టి చూస్తే నాలుగైదు స్థానాల్లో ఉంటున్న కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ పార్టీ నుంచి స్థానికేతరుడు, ప్రధాన పార్టీల అభ్యర్థుల సామాజిక వర్గానికి చెందిన వాడే కావడంతో ఎంత మేరకు ఓట్లు చీలుతాయనేదానిపై చర్చలు జరుగుతున్నాయి. అదీ కాకుండా టీడీపీకి చెందిన ఓట్లు చీలే అవకాశం అధికంగా ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. మొన్నటి వరకు హోరాహోరీగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్య ఉన్న పోరు కాస్తా వార్ వన్‌సైడ్ అన్నట్లుగా పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) ఓటర్లను ముఖాముఖి కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఆయనకు తోడు రాము భార్య జెడ్పీ చైర్‌పర్సన్‌గా నియోజకవర్గ ప్రజలకు సుపరిచరితురాలే కావడం, రాము తండ్రి ఉప్పాల రాంప్రసాద్ కూడా నియోజకవర్గ ప్రజల్లో చిరస్మరణీయుడిగా ఉండిపోవడంతో గెలుపు దిశగా అడుగులు వేస్తున్నాడనే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు చెబుతుండటం గమనార్హం. తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేసేలా మేనిఫెస్టో ప్రకటించడంతో వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూర్చినట్లయిందనే వాదన కూడా వ్యక్తమవుతుంది.

250 మందికి ఉచిత వైద్యసేవలు

పామర్రు: విజయవాడకు చెందిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సౌజన్యంతో స్థానిక విజయవాడ రోడ్డులోని బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మందికి పైగా రోగులు వైద్య సేవలను పొందారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని సేవలను అందించారన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ మధు కృష్ణ, మెదడు, నరాల వైద్య నిపుణులు డాక్టర్ పిబి ప్రశాంత్‌బాబు, కీళ్ల వాత వైద్య నిపుణులు డాక్టర్ జి మమత, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కె.భరత్ చంద్ర, శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ టీ కార్తీక్ తదితరులు వైద్య పరీక్షలు చేశారు.

నాడు మచిలీపట్నం, మల్లేశ్వరం నియోజకవర్గాలు.. నేడు పెడన



పెడన: పెడన నియోజకవర్గం ఒకప్పుడు మల్లేశ్వరం నియోజకవర్గంగా ఉండేది. 1952లో మచిలీపట్నం నియోజకవర్గంగా ఉన్న దాన్ని 1955లో మల్లేశ్వరం నియోజకవర్గంగా చేశారు. పెడన మండలం, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలు మల్లేశ్వరం నియోజకవర్గంలో ఉండేవి. పెడన మేజర్ పంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి మచిలీపట్నం నియోజకవర్గంలో ఉండేది. 2009లో పెడన నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. పెడన మున్సిపాలిటీతో పాటు పెడన రూరల్, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాలు కూడా 'పెడన'లో ఉన్నాయి.

వరుసగా రెండుసార్లు గెలిచింది ఇద్దరే...ఇద్దరూ..

ఈ ప్రాంతానికి 2024 ఎన్నికల ముందు వరకు కూడా ఏడుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మల్లేశ్వరం నియోజకవర్గంగా ఉన్న సమయంలో పిన్నింటి పమిడేశ్వరరావు(కాంగ్రెస్ 1955, 1962)లో వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత కాగిత వెంకట్రావు(టీడీపీ, 1994, 1999) వరుసగా గెలుపొంది రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. పిన్నింటి పమిడేశ్వరరావు 1972లో గెలిచి మూడు సార్లు ఎమ్మెల్యే అవ్వగా కాగిత వెంకట్రావు 1985, 2014లో గెలుపొంది నాలుగు సార్లు ఎమ్మెల్యే అయ్యారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాలపొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు. క్యూలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసులకు 'చలువ' కిట్లు



కోనేరుసెంటర్: బందరు ట్రాఫిక్ పోలీసులకు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలువ కిట్లను అందజేశారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ రమేష్ చేతుల మీదుగా సిబ్బందికి చలువ కళ్లజోళ్లు, మాస్కులతో పాటు చల్లని పానీయాలను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మైత్రి ఫౌండేషన్ సేవలను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేస్తూ అందరి మన్ననలు అందుకోవాలని సూచించారు. ఫౌండేషన్ సభ్యులు రిలాక్స్ ప్రసాద్, పట్టాభి స్వీట్స్ యజమాని శ్రీకాంత్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్, కార్యదర్శి రాధాకృష్ణ, సభ్యులు వక్కంటి రమాదేవి, తేజ, రహీమ్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట: యగ్గోని



కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ 2024 మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణ పేద మహిళలకు సామాజిక ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేయడంపై మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు యగ్గోని గాంధీ హర్షం వ్యక్తం చేశారు. మూడు లక్షల పై చిలుకు ప్రభుత్వ చిరుద్యోగులైనటువంటి ఆశా వర్కర్స్, అంగన్‌వాడీలు, అప్కాబ్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, శానిటేషన్, హోంగార్డులు, వంట పని వాళ్లు తదితర అన్ని ప్రభుత్వ శాఖల్లోని పనివారికి మేలు చేస్తూ విద్య, వైద్య, సంక్షేమ పథకాలు అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆరోగ్యశ్రీ పథకంతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం అమలయ్యే విధంగా గత నిబంధనలను సడలించి మేలు చేయాలని సంకల్పించడం అభినందనీయమన్నారు. చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ పథకాలు వర్తించక అవస్థలు పడుతున్న లక్షలాదిమంది తరపున ఎనలేని మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి యూనియన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దాతల సహకారంతో..



నాగాయలంక: ఎండ, ఉక్కపోత తీవ్రత నేపథ్యంలో మండల శ్రీఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యాన గ్రామంలో ట్రాఫిక్ ఐలెండ్ ప్రధాన కూడలిలో దాతల ఔదార్యంతో ఆదివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. నాగాయలంక ఆర్యవైశ్య సంఘం ఆర్థిక సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు ప్రారంభించారు. పంచాయతీ వార్డు సభ్యుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య, తాడికొండ సత్యనారాయణ, పొన్నూరు రవితేజ, చిట్టా సత్య, హరీష్, రమణ, తూనుగుంట్ల శేషు, శేఖర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

మచిలీపట్నంటౌన్: మాల మహానాడు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు దివంగత కొండ్రు శామ్యూల్ జ్ఞాపకార్థం స్థానిక సర్కిల్ పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం మజ్జిగ, పులిహోరను పంపిణీ చేశారు. అంబేద్కరిస్ట్ మత్తె నాగరాజు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా శామ్యూల్ ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ బండి కిరణ్, మాజీ కౌన్సిలర్ కొండ్రు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు మచిలీపట్నం, జవ్వారుపేట కాపురస్తులు గిరిజాల భాస్కరరావు S/o. నాగేశ్వరరావు గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా... జోగి పోతురాజు గారి కుమారులు, కుమార్తెలు జోగి రాంబాబు, జోగి వెంకటేశ్వరరావు, జోగి వీరవెంకట సుబ్బారావు, పోలగాని వెంకటరమణ మరియు వేముల వెంకటేశ్వరమ్మ గార్లు ది. 24-10-2017న వారి తల్లిగారైన జోగి దమయంతమ్మ గారి ఆస్తులను మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము ద్వారా పంచుకుని రిజిష్టర్డ్ డాక్యుమెంట్ నెం. 6897/2017 ద్వారా పొందియున్నారు. సదరు పార్టిషన్ నందు మచిలీపట్నం, మాచవరం, వార్డు నెం. 15కు చెందిన జోగి వీరవెంకట సుబ్బారావు గారికి రాబడిన వాటా నందు 1వ అయిటం అయిన ఈ దిగువ ఆస్తిని అమ్ముదాముగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి కొంత నగదును అడ్వాన్స్‌గా ఇచ్చి అగ్రిమెంట్ చేసికొనియున్నారు. కావున సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, తనఖా సెక్యూరిటీలు, వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోపు లిఖితపూర్వకంగా తెలియపరచవలసినదిగా కోరటమైనది. అట్లు రానియెడల నా క్లయింట్ సదరు షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి రిజిస్ట్రేషన్ పొందగలడు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండ్ చేయజాలవు.

1వ అయిటం షెడ్యూలు ఆస్తి : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం టౌన్, మాచవరంలోని మున్సిపల్ వార్డు నెం. 15, డోరు నెం. 15/207-23-3కు, ఆర్.ఎస్. నెం. 178/2 యకు చెందిన చ.గ. 80ల నివేశన స్థలం అందుగల ఫస్ట్ ఫ్లోర్ కలిగిన డాబా ఇంటికి హద్దులు. **తూర్పు :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** మున్సిపల్ రోడ్డు, **పడమర :** రాజులపాటి దుర్గాభవాని గారి ఇల్లు, స్థలం, **ఉత్తరం :** పరసా వెంకటేశ్వరరావు గారి స్థలం.

కె.వి. సాయిబాబు, అడ్వకేట్,
మచిలీపట్నం డోర్ నెం. 24/133, రామానాయుడు పేట.
ది. 29-4-2024 ఫోన్ : 93983 76556

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గూడూరు: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీటీసీ డీఎస్పీ రమేష్‌బాబు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఆయా పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, ఎస్‌ఐ వీర్రాజు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలపై ప్రజల్లో అవగాహన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలపై అవగాహన అవసరమని అవనిగడ్డ సీఐ త్రినాథ్ తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి, కుమ్మరిపాలెం గ్రామాల్లో ప్రజలతో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పూర్తిస్థాయిలో అధికారులకు సహకరించాలని సూచించారు. మోపిదేవి ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత



పెడన: విద్యార్థులు ఇష్టపడి చదవాలని, విద్యతోనే బంగారు భవితకు బాటలు వేసుకోవాలని కొసనం హేమానందం సూచించారు. ఆదివారం స్థానిక చిన పైడమ్మ ఆలయంలో హిందీ పండిట్ కొసనం త్రిపురాంతకం త్రిపురాంబ జ్ఞాపకార్థం మాస్టర్ అవార్డ్స్ తరపున ఇటీవల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. కుర్మా సాత్విక, పిచ్చుక హారిక, అబ్దుల్ ఘని, వార్త చైతన్య వర్ధన్, రౌతుల నాగబాబు, వార్త నాగపైడి సంజనలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హేమానందం మాట్లాడుతూ ఏటా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1,500, ప్రోత్సామక బహుమతులు రూ.వెయ్యి చొప్పున నలుగురికి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆళపు సముద్రేశ్వరరావు, కొసనం నేత్రానందం, భూలసర వెంకటేశ్వరరావు, కొసనం లోకనాథం, తోట పైడేశ్వరరావు, పిచ్చుక ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది స్పందనతో తప్పిన పెనుముప్పు

గుడివాడరూరల్: ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదాన్ని సకాలంలో ఫైర్ అధికారులు స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. గుడివాడ పట్టణంలోని జగన్నాథపురంలోని జెడ్పీ గెస్ట్‌హౌస్ వెనుక ప్రాంతంలో ఉన్న రెండు 21కే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కాల్చి పారేసిన సిగరెట్ కారణంగా మంటలు వ్యాప్తి చెందాయి. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు వెంటనే స్పందించి అగ్ని ప్రమాద విషయాన్ని ఫైర్ అధికారులకు తెలియజేశారు. స్పందించిన ఫైర్ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. మంటలను అదుపు చేసిన వారిలో ఫైర్ సిబ్బంది జి.శ్రీనివాసరావు, టి.శేఖర్, వీవీడీ ప్రసాద్ ఉన్నారు.